# రక్తదానం

"హలో మాల్యాద్రీ! ఎలావుంది? రాత్రి బాగా నిద్రపట్టిందా? నైట్ డ్యూటీ సిస్టర్ గ్లూకోజ్ ఇంజెక్షన్ ఇచ్చి వెళ్ళిందా?" నా బెడ్ దగ్గరగావచ్చి స్నేహపూర్వకంగా అడుగుతూ, అక్కడే వున్న స్టూలు దగ్గరకు లాక్కొని కూర్చున్నాడు డాక్టరు నరసింహం.

హాస్పిటల్ కంతటికి పెద్ద డాక్టరైన నరసింహం నాపట్ల చూపే ప్రత్యేకశ్రద్ధవల్ల హాస్పిటల్ స్టాఫంతా నాకు తగని సపర్యలు చేస్తున్నారు. జనరల్ వార్డులోవున్నా, స్పెషల్ వార్డులోని సౌకర్యాలన్నీ అమరుస్తున్నారు.

డాక్టరు నరసింహం, మా ఇద్దరి స్నేహాన్నీ పురస్కరించుకొని, నా మీద శ్రద్ధ కనబరచక పోయివుంటే, నాబోటి ఎలిమెంటరీ స్కూలు టీచరుకు, ఈ హాస్పిటల్‌లో, పైసా ఖర్చుకాకుండా బెడ్ దొరికేదేకాదు.

"నా కిక్కడ కాస్సేపు ఆలస్యం అవుతుంది సిస్టర్! మిగతా బెడ్స్ దగ్గర వుండండి...." అంటూ తన ప్రక్కనున్న నర్స్‌నీ, వార్డ్ బాయ్‌నీ పంపేశాడు నరసింహం.

వాళ్లు అలా వెళ్ళగానే, నాతో నవ్వుతూ అన్నాడు. "మైడియర్ ఫ్రెండ్ నీకో మంచివార్త! నా స్నేహితుడు....ఓ లక్షాధికారి....కొత్తగా సినిమా తియ్యాలనుకుంటున్నాడు. కొత్త రచయితా, కొత్త కథా కావాలన్నాడు! నేను నీపేరు చెప్పేశాను! సాయంత్రం ఆ నిర్మాతా, దర్శకుడూ ఇద్దరూ నీ దగ్గరకు వస్తారు. నేనూ వాళ్ళవెంట వస్తాను. ఎలాగూ బెడ్‌రెస్ట్ తీసుకుంటున్నావు. సాయంత్రంలోగా సినిమాకు పనికివచ్చే చక్కటి కథ ఆలోచించిపెట్టు.. షుమారుగా పాత్రలూ.... కథాస్వరూపం చెప్పగలిగితే

చాలు....నువ్వెలాగూ వారంరోజుల్లో డిశ్చార్జిఅయి వెళతావు. పేపర్ వర్క్ అప్పుడు మొదలెడుదువు గానీ. నా స్నేహితుడు ఫలానా సినిమా కథా రచయిత అని నేనూ గొప్పగా చెప్పుకుంటాను. మొదటిసారి కాబట్టి, ఎక్కువగా డబ్బు కాశపడకు. నీ కథకు తగినంత డబ్బు వచ్చేలా నేను నిర్మాతతో మాట్లాడుతాను. అది నాకు వదిలెయ్. కానీ నీ కథ ఎలా వుండాలో తెలుసా ? ఈ దెబ్బతో ఈ కొత్త నిర్మాత, దర్శకులకు, దేశ విదేశాలలో పేరురావాలి. ఆ పిక్చరుకు అవార్డులు రావాలి. నువ్వు సినీ కథారచయితగా స్థిరపడాలి ! ఏమంటావ్ ?"

ఒక్కసారిగా ఉక్కిరిబిక్కిరై పోయాను! కలలోకూడా ఊహించని పెన్నిధి ఎదురైతే ఏమంటాను ? నా సంతోషాన్ని వ్యక్తం చేసేందుకు మాటలు కూడా కరువయ్యాయి.

"ఆల్ రైట్! నేవెళ్లొస్తా! సాయంత్రం వాళ్ళిద్దరితోవస్తా!" డాక్టర్ నరసింహం వెళ్ళిపోయాడు రౌండ్సుకు. నా మనస్థితి నాకే చిత్రంగా వుంది. ఏదో తొందర, వెర్రిఆనందం, ఆవేశం....కథా వస్తువు కావాలి.... కథ....కథ....దెబ్బతో నా దరిద్రంవదిలించే కథ....నిర్మాతకు లక్షలార్జించి పెట్టే కథ.. బాక్సాఫీస్ రికార్డ్ బద్దలుకొట్టగల కథ....అదేంకథ? ఎక్కడ నుంచి మొదలెట్టాలి ? పాత్రలెవరు ? వాళ్ళ పేర్లేమిటి ?

శాయిలు కథ అయితే....? కొత్తతరహా కథ....తలలో ఆలోచనలు గిరగిర తిరుగుతున్నాయి....

నిన్న ఉదయం జరిగిన చిన్న సంఘటన గుర్తుకు వస్తోంది అప్రయత్నంగా....అదే నాకథకు....సినిమాకు మొదటి దృశ్యం.

* * * *

జనరల్ వార్డులోకి అడుగెట్టిన స్టాఫ్‌నర్స్, దృష్టి అప్రయత్నంగా మూలగా వున్న బెడ్‌మీది పేషెంటుమీద పడింది. పేషెంటుమీద కూడా

కాదు, బెడ్ ప్రక్కనే స్టాండుకు తలక్రిందులుగా వ్రేలాడుతున్న బ్లడ్ బాటిల్ మీద పడింది. మూతనుంచి పైకి .... సగంవరకూ, గడ్డకట్టిన చిక్కటి ర క్తం, ఓ విధమైన నలుపురంగుకు తిరిగి, అసహ్యంగా వుంది. ఆ పైన....సీసా అడుగు భాగంవరకూ, గోధుమరంగు నీళ్ళు (ర క్తంలోని నీళ్లు) వున్నాయి!

"బాప్‌రే! సూపరింటెండెంటు వచ్చే టైమయింది! నైట్‌డ్యూటీ సిస్టర్ ఎంత బాధ్యతా రహితమైన మనిషి! నర్సరాజు మాత్రం ఎక్కడ చచ్చాడో! అతడుగదా ఇలాటివి చూచుకోవాలి! వెయిన్‌లోకి సూది సరిగా దిగబడలేదేమో, లేదా ఈ రోగి మత్తులో చెయ్యి విదిల్చాడో ఏమో! సూది పక్కకుజారిపోయి....గాలి జొరబడి, సీసాలో ర క్తమంతా కడ్డగట్టుకు పోయింది! ఈ బ్లడ్ ఈ పేషెంటు కివ్వబడినట్టు నోట్ చేసుకోవటం కూడా అయింది. ఇప్పుడెలా? మళ్ళీ ఈ గ్రూప్ బ్లడ్ తెచ్చి.... ఇతని కివ్వాలంటే....ఎంత తతంగం! ఎన్ని చీవాట్లు....ఛీ ...ఛీ....ఎలాగోలా గండం గడిచి బయటపడాలి!" లోలోపల ఆమె అదిరి పోతోంది. మిగతా రోగులెవరైనా ఇది గమనించారేమో! రిపోర్టు చేస్తారేమో నన్న శంకతో, వార్డంతా కలయజూచింది. కానీ ఇక్కడున్న రోగులలో ఎవరికీ ఆ ధ్యాసగానీ, అంత ధైర్యంగానీ వున్నట్లు తోచలేదు. తృప్తిగా నిట్టూర్చింది. గబగబ పని ప్రారంభించింది. ఆ రోగి చెయ్యి కుదురుగానే చెక్కవేసి కట్టబడి వుందిగానీ, సూదిపక్కకు జరిగి, అక్కడ ర క్తంబొట్టు గడ్డకట్టి వుంది. మెల్లిగా చేతిమీద వేసివున్న ప్లాస్టర్స్ లాగి వేసింది.... రోగి కదిలాడు. "ఉష్! కదలకు!" అంది విసుగ్గా. భయంగా పడుకున్నాడు. మళ్ళీ ట్యూబూ, బాటిల్ తీసేసింది. ఒకరిద్దరు రోగులిదంతా గమ నిస్తున్నారు గానీ, అర్థంగాలేదు, అడిగే సాహసమూలేదు. అప్పుడే అటుగా వచ్చిన నైట్‌డ్యూటీ డాక్టర్ ఇదిచూచి నాలుక వెళ్ళబెట్టాడు. "ఏమిటిది సిస్టర్!"

స్టాఫ్‌నర్స్ అదిరిపడింది. "ఏమోనండీ ! నేనూ ఇప్పుడే చూస్తున్నాను !" అంది మాటలు తడబడుతూ. డాక్టర్‌కు క్షణకాలం బుర్ర చురుగ్గా పనిచేసింది.

"ఊ ! క్విక్ ! ఇది తీసేయండి. బాటిల్ శుభ్రం చేసేయమని నర్సరాజుకు చెప్పండి ! వెధవగోల ! సూపరింటెండెంటు రౌండ్స్‌కు వచ్చేలోగా....ఊ !" తన బాధ్యత తీరిపోయినట్లు, కంగారుగా వెళ్ళిపోయాడు. ఆమెకు కొండంత ధైర్యం వచ్చింది. గడ్డకట్టిన రక్తం బాటిల్ తీసుకుని నర్సరాజు దగ్గరకు వెళ్ళింది....సంగతి చెప్పింది....

నర్సరాజు నిర్లక్ష్యంగా క్రాపు వెనక్కు తోసుకుంటూ నవ్వాడు. "వెధవ బ్లడ్ బాటిల్‌కేనా ఇంత కంగారు !" అన్నారు. అందంగా వున్న స్టాఫ్‌నర్స్ తనని బ్రతిమాలటం గొప్పగా వుంది. కాస్సేపట్లో తోటీలూ, నర్సులూ అంతా వచ్చేశారు. ఎవరిపన్లు వాళ్ళు చేస్తున్నారు. సూపరింటెండెంటు డాక్టర్ నరసింహం వచ్చాడు.

"ఈ పేషెంటుకు బ్లడ్ ఇచ్చారా?" అన్నాడు స్టాఫ్‌నర్స్‌కేసి తిరిగి, కేసుఛార్టు చదివి.

"ఆ! ఇచ్చాం! ఇంతక్రితమే బాటిల్ రిమూవ్ చేశాను!" అందామె తొణక్కుండా.

"గుడ్ !" ముందుకు కదిలిపోయాడు.

నర్సరాజు ఆ బాటిల్ క్లీన్ చేస్తున్నాడు. గడ్డకట్టినరక్తం....శాయిలుగాడి కివ్వబడిన రక్తం....ఎవరిదో ఈ రక్తం ! ఆ ! ఎవరో రక్తదాతది ! బ్లడ్ డొనార్! అన్నిదానాలలోకీ గొప్పదానం రక్తదానం ! ఆ దాతలు మరీ గొప్పవారు ! బ్లడ్‌డొనార్స్ ! ఎవరో ఆ దాత....ఆ ! ఎవడో ఒకడు.... కొంపదీసి శాయిలుగాడిదేనేమో ఈ రక్తం....వెధవకు.... వాడిరక్తమే

వాడికి లోపలికిపోలే....నర్సరాజు నవ్వుకుంటూ క్లీన్‌చేసిన బాటిల్‌ని పట్టు కెళ్ళాడు....మళ్ళీ అది రక్తంతో నింపాలి....రక్తదాతలను పట్టాలి....

అసలు శాయిలు ఎవరు ?

అదీ సినిమా కథకు ఆయువుపట్టు .... ఇక్కడ రెండో ఘట్టం.... రెండోసీన్ ప్రారంభం కావాలి.... ఫ్లాష్‌బాక్.... గందరగోళంగా కెమెరా గిర్రున తిరిగి శాయిలుమీద కేంద్రీకరింప బడాలి.... నేనే డైరెక్టరునయితే అలా చేస్తాను... అన్నట్టు అడుగో శాయిలు....ఇరవై ఏళ్ళు కూడా నిండని శాయిలు....అరవై ఏళ్ళ వృద్ధుడిలా నీరసంగావున్న శాయిలు....ఆవేదనతో, ఆకలితో, ఆరాటంతో కదులుతున్న కంకాళంలా నడుస్తున్నాడు. వాడింటిలో ఈరోజు పొయిలో పిల్లి లేవలేదు. నిన్నా లేవలేదు. వాడితల్లికి అదేమిటో అంతుపట్టనిజబ్బు, సగం పస్తులవల్ల వచ్చింది. వాడి చెల్లెలు పదహారేళ్ళపిల్ల ....ఆ వయసులో వుండవలసిన అందంమాట అలావుంచి, ఆరోగ్యంకూడా లేదు.... అస్తమానూ మంచంలో పడుకుని దగ్గుతూ.... రక్తం కక్కుతూ వుంది. దాన్ని క్షయాసుపత్రిలో చేర్చాలని చెప్పా డొక డాక్టరు. కానీ అక్కడ బెడ్ సంపాదించాలంటే, కనీసం యాభై రూపాయలైనా ఖర్చు పెట్టుకోవాల్సి వుంటుందనీ, అతడే చెప్పాడు. అది కక్కుతున్న రక్తం చూచినప్పుడల్లా వాడికి భయం.... జుగుప్స.... కానీ ఏంచెయ్యటం ? ఫ్యాక్టరీల చుట్టూ తిరిగాడు పనిచేస్తానంటూ. పిండి మిల్లులు, బియ్యం మిల్లు, గ్లాస్‌ఫ్యాక్టరీ, పొగాకు కంపెనీలూ... అన్నిటి ల్లోనూ ఒకటేపాట ! కాస్త పల్లవి మార్పుతో వినిపించింది. వందరూపా యలు "ముడుపు" చెల్లించుకొంటే టెంపరరీ "కూలీ"గా చేర్చుకో బడుతాడు. ఆ తర్వాత ఆ ముఠానాయకుడికి చెల్లించుకొనే "ముడుపు" బరువునుబట్టి పర్మినెంటు కావటమూ, జరుగుతుంది. ఆ వందా వచ్చే మార్గం ?

"దుక్కలా వున్నావ్ ; కాళ్ళూ చేతులు సరిగా వుండి, అడుక్కు తినడమేం ఖర్మ ! ఇదే మన దేశానికి పట్టిన దౌర్భాగ్యం !" అన్నాడొక పెద్దమనిషి. కారు ముందు నిల్చుని చెయ్యిజాపిన శాయిలును చూచి విసుక్కుంటూ.

కాళ్ళీడ్చుకుంటూ నడుస్తున్న శాయిలు కొంత దూరంలో "వాన్" ఆగింది. మైక్‌లో ఏదో చెబుతూ, కరపత్రాలు విసిరివేయబడ్డాయి. ఆసక్తిగా కాగితం అందుకున్నాడు. అందులో ఏముందో వాడికి తెలియదు. మైక్‌లో మాటలు కొన్ని అర్థమౌతున్నాయి.... మరికొన్ని అర్థం కావటం లేదు.

"యుద్ధంలో గాయపడిన వారికోసం రక్తం దానమివ్వండి. మీలాటి వేలాది సోదరుల ప్రాణాలు కాపాడండి. మీ ప్రతి రక్తపుబొట్టు మీలాటి ఒక్కొక్క సోదరుడికి ప్రాణదానంచేస్తుంది. జాతిని నిలుపు తుంది. మాతృదేశ గౌరవాన్ని నిలుపుతుంది. హాస్పిటల్‌లో జబ్బులతో తీసుకుంటున్న మీ తోటి మానవులకు, మీ రక్తమిచ్చి ప్రాణదానం చేయండి !"

ఆ తర్వాత వాన్‌లోని వారందరూ రోడ్డు ప్రక్కగా వున్న టీ బంకులోకి వెళ్ళి టీ తాగుతున్నారు. శాయిలు ధైర్యంచేసి వాళ్ళదగ్గరగా వెళ్లాడు. టీ తాగుతున్న నర్సరాజే ముందుగా పలకరించాడు శాయిలును, "ఏం కావాలి ?"

"ఇదేంటి ?" చేతిలోవున్న కాగితం చూపిస్తూ అడిగాడు. నర్సరాజు క్షణకాలం, నఖశిఖ పర్యంతం పరీక్షగా చూశాడు. హస్తసాముద్రికుడిలా ఏదో పసికట్టాడు. "ఇలారా !" అంటూ కాస్త దూరంగా పిల్చుకెళ్ళాడు. మళ్ళీ శాయిలు అడిగాడు "ఇదేందిసార్" అని. "రక్తం....రక్తం..." నర్సరాజు గుసగుసగా అన్నాడు.

"ఎక్కడ ?" భయంగా చుట్టూరా చూశాడు శాయిలు... వాడికి చెల్లెలు కక్కిన రక్తం గుర్తుకొచ్చింది.

"నీలో లేదూ !" నర్సరాజు నవ్వాడు.

"వుంది !"

"దానం ఇవ్వరాదూ !"

అర్థంగాలేదు శాయిలుకు. నర్సరాజు వేదాంతిలానవ్వాడు. "ఇంద, ఈ టీ తాగు ముందు ... అప్పుడుగానీ నే చెప్పేది నీకర్థంగాదు ! అంటూ టీ ఇప్పించాడు. అది తాగాక, నిజంగానే శాయిలుకు కాస్తప్రాణమూ, తెలివీ వచ్చాయి.

"నీలోని రక్తం కొంచెం దానం ఇస్తే - ఊరికే కాదనుకో, నీకు డబ్బిస్తారు. 'హార్లిక్స్' అని అదొక బలం వచ్చే మందులే .... సీసా కొనిస్తారు. అది తాగితే నీ రక్తం నీలోకి రెండురోజుల్లో వచ్చేస్తుంది. నువ్విచ్చిన రక్తం ఆస్పత్రులలోని రోగులకూ, సైన్యంలో గాయపడ్డ వారికీ ఉపయోగిస్తుంది....ఏమంటావ్ !" అన్నాడు నర్సరాజు. అంతా బాగా అర్థంకాలేదుగానీ "డబ్బిస్తారు" అన్న, ఒక్కముక్కా బాగా అర్థమయింది శాయిలుకు. వెధవ రక్తం ! అది తనలో వుంటే ఎంత ? పోతే ఎంత ! తనలోని ఈ రక్తం తన అమ్మ రోగం తగ్గిస్తోందా ! చెల్లెల్ని ఆస్పత్రిలో చేర్చేందుకు పనికివస్తోందా ? అది కక్కటంలా, దోసెళ్ళకొద్దీ రక్తం? అనుకున్నాడు శాయిలు. వెంటనే "డబ్బెంతిస్తారు?" అనడిగాడు ఆశగా.

"అదంతా ఒక లెక్క ! ఇన్ని ఔన్సులు రక్తం ... ఇంత డబ్బు అని వుంటుందిలే, నీకెందుకు నువ్వివ్వరాదూ రక్తం ! మిగతావి నేను చూస్తాను. మరోమాట. ఇలా అందరిదగ్గరకూ పరుగెత్తకు. మోసం చేస్తారు నిన్ను. డబ్బుసరిగా ఇవ్వరు. నా దగ్గరకే రా ! నా అడ్రస్ చెబు

తాను....ఫలానా ఆస్పత్రి దగ్గర కొచ్చి ఎవరి నడిగినా, నేనెక్కడుండేది చెబుతారు. నీలాటి కుర్రాళ్ళింకా ఎవరైనా వుంటే, నీ వెంట పిల్చుకురా! మరో మాట! మీ పెద్దాళ్ళకు తెలియనివ్వకు. చాదస్తంగా ఏడుస్తారు. వద్దంటారు." అన్నాడు నర్సరాజు.

అన్నిటికి వినయంగా తలూపాడు శాయిలు. తనపేటకు పరుగెత్తి తన వయసు కుర్రాళ్ళకు కొందరికి ఈ రహస్యం, అతి రహస్యంగా చెప్పాడు. కొందరు భయపడ్డారు. మరికొందరు "ముందు నువ్వు డబ్బు తీసుకురా శాయిలూ, అప్పుడొస్తాం మేమూనూ!" అన్నారు. ఇదేదో రహస్యంగా డబ్బు సంపాదించే మార్గం. ఇక ఎవరికీ చెప్పకూడదు అని కూడ అనుకున్నాడు శాయిలు.

మర్నాడే, ఆస్పత్రి గేటు దగ్గర నర్సరాజును కల్సుకున్నాడు. నర్సరాజు మెప్పుదలగా నవ్వి, చెయ్యిపట్టుక, స్నేహంగా మాట్లాడుతూ లోపలకు పిల్చికెళ్ళాడు. అంత పెద్ద ఆస్పత్రిలో తనెటువైపు వెళ్తున్నాడో కూడా బోధపడలేదు శాయిలుకు. చివరకు ఒక గది బయట శాయిలును నిల్చోమని చెప్పి, లోపలికివెళ్ళి ఎవరితోనో ఏదో మాట్లాడి....బయటకు వచ్చాడు నర్సరాజు.

"శాయిలూ! రక్తం ఇస్తావా? అని వాళ్ళడుగుతారు." "ఔను సార్! రక్తదానం చెయ్యాలని వచ్చాను. తప్పక తీసుకోండి'' అని చెప్పు అన్నాడు. తలాడించాడు శాయిలు. గదిలో ఎవరో ఇద్దరు డ్రెస్సులలో వున్నారు.

"రగతదానం సేత్తానండీ!" అన్నాడు శాయిలు. వాళ్ళిద్దరూ నవ్వారు. 'శాయిలు పేరూ, మరేదో వ్రాసుకున్నారు. బెంచిమీద పడుకో బెట్టి చెయ్యి జాపమన్నారు.' సూది గుచ్చుతుంటే, బాధ....

"ఫర్వాలేదులే ! కా స్తంత ఓర్చుకో. అన్ని దానాలలోకీ గొప్ప దానం ... మరి ర క్త దానమంటే !" నర్సరాజు ధైర్యంచెప్పాడు. శాయిలు కళ్ళు మూసుకున్నాడు. బాధ ఓర్చుకున్నాడు.

"గుడ్ ! నువ్వింక లేవొచ్చు !"

శాయిలు లేచి నిల్చున్నాడు. సీసాలో ఎర్రటి ర క్తం! అది తనదా !

"భయపడకు. రెండు రోజుల్లో కోలుకొంటావు.... ఇదుగో.... పాతిక రూపాయలు.... హార్లిక్స్ సీసా. ఈ సీసాలోవున్న పొడి రెండు పూటలూ వేణ్ణీళ్ళలోకలుపుకునితాగు. త్వరగా నీ ర క్తం నీకు వచ్చేస్తుంది!" అన్నాడు నర్సరాజు.

పాతిక రూపాయలే ! శాయిలు గుండె ఆనందంతో కొట్టుకుంది. ఆ చిన్నచిన్న సీసాల్లోతీసిన తన వెధవర క్తం.... ఖరీదు పాతికరూపాయలు! ఇక తన లోపలుండే అంతా ర క్తం ఖరీదు ఎంతౌతుందో ! నాలుగురోజుల పాటు ఇంటిల్లిపాదీ కడుపునిండా తిండి తినొచ్చు. ఇట్లాంటి పాతికలు నాలుగై తే,చెల్లెల్ని ఆస్పత్రిలో చేర్పించవచ్చు. మరో నాలుగు పాతికలై తే, తను ఏదైనా కంపెనీలో కూలీగాచేరటానికి "ముడుపు" చెల్లించుకోవచ్చు.

సంతోషంగా గేటు బయటకు వచ్చిన శాయిలును, నీడలా అనుస రించాడు నర్సరాజు. కృతజ్ఞతలు కళ్ళనిండుగా వర్షిస్తూ, "మళ్ళీ ఎప్పుడు రమ్మంటారు సార్ ?" అన్నాడు శాయిలు.

నర్సరాజు నవ్వాడు "వెంటవెంట తీయగూడదు ర క్తం. పదిహేను రోజుల తర్వాత కనిపించు ..."అన్నట్టు....ముందుగా నేను లోపలికెళ్ళి .... ఆ బాబులకు ఎంత రెకమండేషన్ చేశాననుకున్నావు నీగురించి. నీ బ్లడ్ ఘంచిదని చెప్పాను. ఆరోగ్యంగా వున్నవాడివని చెప్పాను.... ఒప్పించే

సరికి తలప్రాణం తోక్కొచ్చిందనుకో! మరి.... ఇంత సాయంచేసిన నాకు.... ఓ పది రూపాయలు ఇవ్వవూ ... ఇహిహి !" అంటూనే చనువుగా పదిరూపాయలనోటు లాక్కున్నాడు.

క్షణకాలం గతుక్కుమన్నాడు శాయిలు. కానీ అంతలోనే వాడికి తన "చిన్నబుద్ధి" మీద కోపం వచ్చింది! పెద్దమనిషి నర్సరాజు ఇంత సాయం చేసి తనకు డబ్బిప్పిస్తే, ఆ మాత్రం డబ్బు తను ముందుగానే ఇవ్వాల్సిం దనిపించింది. తేరగా వచ్చిన డబ్బు! పదిహేను రూపాయలే చాలు తనకు.

"అట్టాగే తీసుకోండిసార్. నేనెల్తానిక," అడుగు ముందుకు వేయబోతున్న శాయిలు జబ్బమీద బలంగా చెయ్యిఆన్చి ఆపాడు నర్సరాజు. "ఉండు. నీదంతా తొందరే! ఆ హార్లిక్స్ సీసా ఇట్లాతే! వెధవ పొడి. వారం తాగినా బలం రాదు నీకు... ఇదిగో ఈ మాత్రలు చూడు .. ఎర్రగా నెత్తురులా వున్నాయికదూ! త్వరగా రక్తం పట్టేందుకు వాడతారు గొప్పవాళ్ళు ఇవి. ఇవెంతో ఖరీదు.... మీబోటివాళ్లు కొనలేరు. ఏదో నా పలుకుబడికొద్దీ డాక్టరు బాబుల దగ్గర నాకోసమని తీసుకున్నాను.... నీకిస్తున్నాను. రోజూ రెండుపూటలా ఒక్కొక్కటి చొప్పున మింగెయ్." ఎర్రని మాత్రలేవో పది శాయిలు చేతిలో పెట్టాడు.

మళ్ళీ కృతజ్ఞత వర్షించాయి శాయిలు కళ్ళు! సీసా ఇచ్చేసి గబ గబ ఇంటివేపు నడిచాడు. పదిహేను రూపాయలు తల్లి చేతిలో వుంచి, అవెలా వచ్చాయన్నదీ ఎంతడిగినా చెప్పకుండా, మూడురోజులకు ఇంట్లో కూటిక్కావలసిన గింజలు కొనమని చెప్పాడు.

నర్సరాజు పదిహేనురూపాయలు భార్యచేతిలో పెట్టాడు గొప్పగా.... సాయంత్రం ఫస్టుషో సినిమాకు పోదామని చెప్పాడు. ఆమె నవ్వింది. "ఏమిటో బలహీనంగా వున్నావు .... నీకోసం కొనుక్కు వచ్చాను

హార్లిక్స్ ! రోజూ తాగు" అన్నాడు. ఆమె మరింతగా మురిపెం చూపించింది.

శాయిలు పది రోజులకే ఆస్పత్రి దగ్గర తచ్చాడుతూండటం గమనించాడు నర్సరాజు.

"అరె ! అప్పుడే వచ్చావేం శాయిలూ !" అన్నాడు.

"ఏం చెయ్యనూ ! కూటికి లేవు...." తలొంచుకుని అన్నాడు.

"సరే ! పదిరోజుల్లోగా నీపేరుతోనే రక్తం తీస్తే బావుండదు....నీ పేరు మార్చి చెబుతాను....ఈమారు నీపేరు నారిగాడు. సరేనా !"

"సరే !"

నారిగాడుగా రక్తదాతల లిస్టులోకి ఎక్కాడు శాయిలు. పదిహేను రూపాయలతో ఇంటికి పరుగుతీశాడు....

ఈమారు నాలుగు రోజులకే అక్కర పడింది శాయిలుకు. కారణం చెల్లెలు మరీ ఎక్కువగా కక్కుతోంది రక్తం. దాన్ని తొందర లోనే ఆస్పత్రిలో చేర్చాలి ! ఏందో ! ఇట్లా పదిహేను తీసుకోవటం, అట్లా కూటికి అయిపోవటం ! కూడబెట్టేదెప్పుడు ?

"ఇదేమిట్రా శాయిలూ ! నాలుగురోజులకే వచ్చావు ? పేరైతే మార్చగలం గానీ, నీ రెండు చేతులమీదా నరాలదగ్గర సూది దిగబడిన గాయంగుర్తులు ఎలా మార్చగలం; లోపలి బాబులు కూడా ఆ మాటే అంటున్నారు !" అన్నాడు నర్సరాజు చిరాగ్గా.

"తవరే అట్టాగంటే ఎట్టా ? అక్కర...."

"అక్కర....అక్కర ! అక్కర లేందెప్పుడు మీ బతుకులకు ? సర్లే ? ఎక్స్ట్రాగా ఓ రెండు రూపాయలిస్తానంటే, ఎట్లాగో ఓలా లోపలి

బాబులకు నచ్చచెప్పి, కాలినరాలకు పొడిపిస్తాను సూది." అన్నాడు నర్సరాజు మెహర్బానీగా....

సంతోషంగా తలూపాడు శాయిలు.

ఈ మారు వాడిపేరు రాగడుగా రక్తదాతల రిజిస్టర్‌లో లిఖించబడి కాలినరంలోకి దిగబడింది సూది....జలగలా రక్తంపీల్చిన సిరంజి ...చిన్న సీసాలోకి కక్కిందా రక్తాన్ని....సీసా పొట్ట నిండింది!

పదమూడు రూపాయలతో పరుగు తీశాడు శాయిలు....రెండు చేతులూ, కాలినరమూ జివ్వుమంటున్నాయి. ఏదో నీరసం... భక్తిగా, నర్సరాజు ఇచ్చిన ఎర్రని మాత్ర మింగాడు.

శాయిలు స్నేహితులలో నలుగురైదుగురికి ఈ పద్ధతి నచ్చింది ... వాళ్ళు తమ స్నేహితులు మరికొందరికి చెప్పారు ఈ రహస్యం.... వాళ్ళందరికీ క్షయతో బాధపడే చెల్లాయిలు లేరు, కానీ పోలియోవచ్చిన తమ్ముళ్లో, కుంటి, గుడ్డి, మూగ, చెవిటి, అవిటి అక్కచెల్లెళ్లో, అన్న దమ్ములో, అమ్మానాన్నలో వున్నారు. వాళ్ళందరికి ఆకలి వుంది ... కూలినాలి చేసేందుకు తమకక్కావాలన్న ధ్యాసలేదు.

బ్లడ్‌బాటిల్స్ నిండుతున్నాయి. గ్రూప్‌లు నిర్ణయించబడుతున్నాయి. స్పెషల్ వార్డులలోని పేషెంట్లకు.... సైన్యంలో గాయపడిన వారికీ, ఇతరరోగులకూ సరఫరా చేయబడుతున్నాయి. కొన్ని కొందరి నిర్లక్ష్యం వల్లో, పొరబాటు వల్లో గడ్డకట్టి పోతున్నాయి.

శాయిలు చెల్లెలు రక్తం కక్కీ, కక్కీ (వెధవరక్తం! బయటకు వచ్చీ, ఏమీ డబ్బివ్వలేదు!) శాయిలు రక్తం ఇచ్చిన డబ్బు, ఏ నాటికీ యాభై రూపాయలుగా రూపుదాల్చక, ఆకాశవాణి అందరికీ "శుభోదయం" అని చెబుతున్న ఓ శుభోదయాన, ఆఖరు రక్తం బొట్టునుకూడా బయటకు

పంపి, కళ్లు మూసుకుంది. కూతురు రక్తమంతా, చేతులతో ఎత్తిపోసిన శాయిలు తల్లి, మెల్లిమెల్లిగా దగ్గుతూ, కొద్దికొద్దిగా రక్తం ఉమ్మేస్తోంది.

శాయిలు కాళ్ళమీద నరాలమీద చిల్లులు పడినచోట్ల రక్తపు గీరలున్నాయి. అలాటివే చేతులకూ వున్నాయి. గుండెలోని ఒక అరలో రక్తం తగ్గిపోతోంది.... ఆ అర మరి నిండటంలేదు....

రక్తం తగ్గి, పాలిపోయి, నడవటానికి శక్తిలేక.... తనెందుకింత జబ్బు పడ్డాడో అర్థం చేసుకోలేని శాయిలు.... ఆఖరు సారిగా....తనలానే "సంపాదిస్తున్న" తన స్నేహితుడొకడి దగ్గర పదిహేను రూపాయలు అప్పుతీసుకొని, అవి నర్సరాజు చేతుల్లోపోసి, ఆస్పత్రిలో బెడ్డు సంపాదించుకోగలిగాడు ...

కానీ....వాడిచ్చిన రక్తం....వాడిని ఏనాడూ ఆదుకోలేదు. ఈనాడు కూడా.... అది కాస్తా, మానవత్వంలానే గడ్డకట్టిపోయి, నీళ్ళు వేరుచేసి, "రక్తం నీళ్ళకంటే చిక్కనైనది" అని ఋజువుచేసి మరీ వూరుకొంది. ఆ నిజం తెలుసుకోకుండానే శాయిలు గుండెలో చివరగా మిగిలిన రక్తం కాస్తా గడ్డకట్టిపోయింది!

నర్సరాజు మాత్రం ... ఆ సంవత్సరం రక్తదాతలనుంచి ఎక్కువ రక్తం సేకరించ గలిగినందుకు - అతడి సేవకు గుర్తింపుగా చిన్న వెండి మెడల్ బహుమతిగా పొందగలిగాడు. ఓ గొప్ప ఆసామీ "రక్తదాతలను" గురించి ఇంగ్లీషులో గొప్ప వ్యాసం వ్రాశాడు కూడా!

కానీ శాయిలు.... శాయిలులాటి రక్తదాతల.... జీవితాల.... కథల ముగింపు ఏమిటి? ఈ కథలకు పేరేమిటి? "రక్తదాతలా?" "జలగలా?"

* * * * * *

"హలో మాల్యాద్రీ! కాస్తైనా బుర్ర పనిచేసిందా? ఆలోచన వచ్చిందా?"

డాక్టర్ నరసింహం వచ్చి నిల్చుని అడుగుతుంటే, ఉలికి పడ్డాను. ఇందాకా దృశ్యాలు కూడా నేనే డైరెక్టు చేస్తూ, చిత్రీకరిస్తూ నా మనసులో తీస్తున్న సినిమా మాయమైంది....

"ఆ! బ్రిలియంట్ ఐడియా వచ్చింది నరసింహం! నిజంగా ఇది సినిమాగా తీస్తే.... తెలుగులో సినిమా కథలన్నీ వెధవ ప్రేమ, పెళ్ళి తప్పమరేముందీ? అన్న అపప్రధ తొలగిపోతుంది. మళయాళ చిత్రాలలా, కన్నడ చిత్రాలలా, బెంగాలీ చిత్రాలలా మన చిత్రాలకూ గుర్తింపూ, గౌరవం వస్తుంది....మీ నిర్మాత, దర్శకులు ఒక్కదెబ్బలో... దేశవిదేశాల అవార్డులు గెల్చుకుంటారు!" ఆవేశంగా అన్నాను....

"నాకు తెల్సు. నువ్వంతటి కథ తయారు చేయగలవని...."

"నీకు చెప్పనా!" అన్నాను ఉత్సాహంగా.

"ఊహూఁ! మరో పది నిముషాల్లో, మా స్నేహితుడు నిర్మాతా, ఆయన స్నేహితుడు డైరెక్టరూ వస్తారు .... అప్పుడు చెప్పు...." అన్నాడు నరసింహం హుషారుగా.

మరో పదినిముషాల్లో వాళ్ళిద్దరూ వచ్చారు ...

నేను ఆవేశంగా కథ చెప్పుకు పోయాను....

"చివరలో ఈ సమాజంలో జరుగుతున్న ఇలాటి పాశవిక చర్యలనూ, మౌఢ్యాన్ని ఎలా అరికట్టాలన్న ప్రశ్నను ప్రేక్షకులకే వదిలి వేద్దాం, సమస్యను గురించి జిజ్ఞాస మాత్రం ప్రేక్షకులలో రేకెత్తిస్తే చాలు....న్యూవేవ్"

తలెత్తి నరసింహంవేపు చూశాను. అపరిమితమైన కోపాన్ని అణుచుకుంటున్నట్లు .... ముఖమంతా కమిలిపోయింది .... పిచ్చివాణ్ణి చూచినట్లు, నావేపు చూస్తున్నాడు.

నిర్మాతవేపూ, దర్శకుడివేపూ చూశాను. ఇద్దరూ కాళ్ళకింది పాల గచ్చును గుచ్చిగుచ్చి చూస్తున్నారు .... వస్తున్న నవ్వును బలవంతంగా బిగబట్టు కుంటున్నారనిపించింది....

"చాల సంతోషం ! ఈ కథ గురించి మా అభిప్రాయం....డాక్టర్ గారికి చెబుతాం...." అంటూ లేచారు.

నరసింహం తలొంచుకుని వాళ్ళని అనుసరించాడు....

"సారీ !" అని వుంటాడేమో నరసింహం....

నిర్మాత, దర్శకుడూ విరగబడి నవ్వివుంటారేమో !

నాది పనికిరాని కథే....శాయిలు జీవించాలనే.... కానీ ఈ క్షణంలో నా సమస్య అదికాదు.

ఆ కోపంలో నరసింహం .... నన్ను రేపే డిశ్చార్జి చేస్తున్నట్లు చెప్పి పంపాడు ! నా ఆరోగ్యం.... ?

("తరుణ" జనవరి 1974)